గ్యారెంటీలు రద్దు చేయండి!

- అనవసరమైన హామీలతో రాష్ట్ర ఖజానా ఖాళీ
- హామీల వల్ల పేదలకు ఇండ్లు ఇవ్వలేకపోతున్నాం
- కనీసం 2-3 గ్యారెంటీలైనా నిలిపేయాల్సిందే
- కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు సొంతపార్టీ ఎమ్మెల్యే గవియప్ప విజ్ఞప్తి.. డీకే మండిపాటు
- బహిరంగంగా చెప్పడమేంటని షోకాజ్ నోటీసులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): అధికారమే పరమావధిగా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనాలోచితంగా ఇచ్చిన గ్యారెంటీలతో రాష్ట్రాలు దివాలా తీసే దుస్థితి వాటిల్లుతున్నది. హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలో దాదాపుగా ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలపై సొంతపార్టీ ఎమ్మెల్యేలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్ఆర్ గవియప్ప తాజాగా ఇవే తరహా వ్యాఖ్యలు చేశారు. సొంత నియోజకవర్గం విజయనగరలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న గవియప్ప మాట్లాడుతూ..



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఐదు గ్యారెంటీలపై అసహనం వ్యక్తం చేశారు. గ్యారెంటీల కారణంగా ఖజానాలో నిధులకు కటకట మొదలైనట్టు వాపోయారు. నిధుల లేమితో పేదలకు ఇండ్లను కూడా ఇవ్వలేని దుస్థితి వాటిల్లినట్టు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం సిద్ధరామయ్య వెంటనే ఐదు గ్యారెంటీల్లో అనవసరమైనటువంటి 2-3 హామీలనైనా రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఎమ్మెల్యే వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మండిపడ్డారు. షోకాజ్ నోటీసులు జారీ చేస్తానని హెచ్చరించారు.

ఎమ్మెల్యే ఏమన్నారంటే?

'కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఐదు గ్యారెంటీల అమలుకే ఏటా ఖజానా నుంచి రూ. 40 వేల కోట్ల మేర ఖర్చు చేయాల్సి వస్తున్నది. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఇండ్లను కూడా ఇవ్వలేని దుస్థితి దాపురించింది. గ్యారెంటీలను రద్దు చేయడం మంచిది. అవసరంలేని 2-3 గ్యారెంటీలనైనా నిలిపేయాలి. అప్పుడే పేద లకు సంక్షేమ పథకాలను అమలు చేయగలం. ఏదేమైనా దీనిపై సీఎం సిద్ధరామయ్యనే నిర్ణయం తీసుకోవాలి. ఆయన ఏ నిర్ణయం తీసుకొన్నా అందరం దానికి కట్టుబడి ఉంటాం' అని గవియప్ప అన్నారు.

డీకే మండిపాటు

బహిరంగ కార్యక్రమంలో గ్యారెంటీలపై గవియప్ప తన అభిప్రాయాన్ని వెల్లడించడంపై డిప్యూటీ సీఎం శివకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్టు ప్రకటించారు. 'ఇది కాంగ్రెస్ పార్టీ. గ్యారెంటీలపై గవియప్ప అలా మాట్లాడి ఉండాల్సింది కాదు. గ్యారెంటీలను ఎట్టిపరిస్థితుల్లో నిలిపేయబోము. గ్యారెంటీలకు వ్యతిరేకంగా ఎవ్వరూ ఇకపై మాట్లాడొద్దు. గ్యారెంటీలు రద్దు చేయాలన్న గవియప్పకు షోకాజ్ నోటీసులు జారీ చేయబోతున్నా' అంటూ డీకే ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంతరిక్షంలో 'ఏఐ ల్యాబ్'

లాంచ్ చేస్తున్న హైదరాబాద్ స్టార్టప్ కంపెనీ

న్యూఢిల్లీ: అంతరిక్షంలో కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత ల్యాబ్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ కంపెనీ ప్రకటించింది. దీనిని వచ్చే నెలలో ఇస్రో పీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా ప్రయోగిస్తున్నట్టు 'టెక్‌మి2స్పేస్' స్టార్టప్ కంపెనీ మంగళవారం తెలిపింది. ఆర్బిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-టెక్నాలజీ డిమాన్స్ట్రేటర్.. అంతరిక్షంలో భారతదేశపు మొట్టమొదటి ఏఐ ల్యాబ్‌గా కంపెనీ పేర్కొన్నది. కక్ష్యలో రియల్-టైమ్ డాటా ప్రాసెసింగ్, అంతరిక్ష పరిశోధనను మరింతగా అందుబాటులోకి తీసుకురావటం 'ఏఐ ల్యాబ్' ముఖ్య ఉద్దేశంగా తెలిపింది. శాటిలైట్స్ పంపే డాటాను..అంతరిక్షంలోనే ఏఐ ల్యాబ్ ప్రాసెస్ చేస్తుందని కంపెనీ సీఈవో చెప్పారు.

ఒక్క చాయ్ రూ. లక్ష

'గోల్డ్ టీ' అమ్ముతున్న దుబాయ్ కెఫే

దుబాయ్ : సాధారణంగా ఒక చాయ్ ధర రూ.10-20 ఉంటుంది. ఫైవ్ స్టార్ హోటళ్లలోకి వెళ్తే రూ.500 వరకు కూడా ఉండొచ్చు. దుబాయ్‌లోని బొహో కెఫేలో మాత్రం ఒక్క చాయ్ ధర అక్షరాలా లక్ష రూపాయలు. దుబాయ్‌లోని ఎమిరేట్స్ ఫైనాన్షియల్ టవర్స్‌లో భారత సంతతికి చెందిన సుచేత శర్మ ఈ కెఫేను నిర్వహిస్తున్నారు. ఇందులో 'గోల్డ్ కడక్' చాయ్ అమ్ముతున్నారు. ఈ చాయ్‌పైన ఒక గోల్డ్ లీఫ్(బంగారు పూత)ను పెడతారు. చాయ్‌తో పాటు తినడానికి బంగారం చల్లిన క్రోసెంట్ కూడా ఇస్తారు. చాయ్‌ను వెండి కప్పు, సాసర్‌లో ఇస్తారు. వీటిని చాయ్ తాగిన వారు తమతో పాటు తీసుకెళ్లొచ్చు. ఈ గోల్డ్ టీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'చాయ్ తాగడానికి ఈఎంఐ ఆప్షన్ ఉందా?' అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

గ్రహ శకలాల నుంచి భూమికి రక్ష

- ఆస్టరాయిడ్ల కక్ష్యను కచ్చితంగా అంచనా వేసేందుకు కొత్త ఆలోచన
- ప్రతిపాదించిన స్పెయిన్ శాస్త్రవేత్త

లండన్, నవంబర్ 26: గ్రహశకలాలు భూమిని ఢీకొడితే సంభవించే విపత్తును అంచనా వేయడం కూడా కష్టమే. అరుదుగా ఈ ప్రమాదం జరిగే అవకాశం ఉన్నప్పటికీ ఈ ఊహనే ఆందోళన కలిగిస్తుంది. అత్యంత కచ్చితత్వంతో గ్రహశకలాల గమనాన్ని గుర్తించి, భూమికి ప్రమాదాన్ని దూరం చేసేందుకు స్పెయిన్‌లోని ముర్సియా యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్త ప్రొఫెసర్ బార్కో నొవిల్లో కొత్త ఆలోచనను ప్రతిపాదించారు. ఇందుకు సంబంధించిన వివరాలు రాయల్ ఆస్ట్రోనామికల్ సొసైటీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. గ్రహశకలాల కక్ష్యను అత్యంత కచ్చితత్వంతో గుర్తించడం కోసం ప్రొఫెసర్ నొవిల్లో బుధగ్రహంపై ఒక ప్రయోగం చేశారు. సాధారణంగా ఏదైనా వస్తువు నుంచి కాంతి కిరణాలు నేరుగా మన కళ్ల మీద పడతాయి. దీంతో ఆ వస్తువు ఎక్కడ ఉంటే, అక్కడే ఉన్నట్టు మనకు కనిపిస్తుంది. ఎక్కడో దూరాన ఉండే గ్రహశకలాల విషయంలో ఇలా జరగదని, 'గురుత్వాకర్షణ విక్షేపం' వల్ల గ్రహశకలాలకు తాకిన కాంతి వంపు తిరుగుతుందని నొవిల్లో చెప్తున్నారు. కాబట్టి, గ్రహశకలాల కక్ష్యను గుర్తించేటప్పుడు గురుత్వాకర్షణ విక్షేపాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, తద్వారా కచ్చితంగా వాటి కక్ష్యను గుర్తించొచ్చని ప్రతిపాదించారు.

భూమి వైపునకు దూసుకొస్తున్న గ్రహశకలాలు

గ్రహశకలం	పరిమాణం	భూమిని ఎప్పుడు ఢీకొనవచ్చు?
2023డీడబ్ల్యూ	166 ఫీట్లు	14 ఫిబ్రవరి, 2046
1979ఎక్స్‌బీ	2,165 ఫీట్లు	14 డిసెంబర్, 2113
2023టీఎల్4	1,083 ఫీట్లు	10 అక్టోబర్, 2119
బెన్ను	1,574 ఫీట్లు	24 సెప్టెంబర్, 2182
1950డీఏ	6,561 ఫీట్లు	16 మార్చి, 2880

గ్రహ శకలాలను అడ్డుకోవచ్చా?

భూమిపైకి దూసుకొచ్చే గ్రహశకలాలను అడ్డుకునే సామర్థ్యం, సాంకేతికత ఇప్పటివరకు మనుషుల వద్ద లేదు. ఈ సామర్థ్యం కోసం నాసా, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ డబుల్ ఆస్టరాయిడ్ రీడైరెక్షన్ టెస్ట్(డార్ట్) పేరుతో ఓ ప్రయోగం చేస్తున్నాయి. డైమోర్ఫోస్ అనే చిన్న గ్రహశకలాన్ని రీఫిజిరేటర్ సైజులో ఉన్న ఒక వ్యోమనౌకతో ఢీకొట్టించడం ద్వారా దాని కక్ష్యను మార్చాలనేది ఈ ప్రయోగం లక్ష్యం. వచ్చే ఏడాది డిసెంబర్‌లో ఈ ప్రయోగ ఫలితాలు తెలియనున్నాయి.

కర్ణాటకలో రూ.46,300 కోట్ల స్కామ్

- రహదారుల నిర్మాణం, మరమ్మతు పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి
- భాగమైన బీబీఎంపీ అధికారులు, ప్రజాప్రతినిధులు
- యాంటీ-కరప్షన్ ఫోరమ్ అధ్యక్షుడు ఎన్నార్ రమేశ్ ఆరోపణలు.. ఈడీ అధికారులకు ఫిర్యాదు
- పీఎంఎల్‌ఏ చట్టం కింద కేసు దర్యాప్తునకు డిమాండ్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): ముడా, వాల్మీకి కుంభకోణాలతో ఇప్పటికే అప్రతిష్ఠ మూటగట్టుకొన్న కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో తాజాగా మరో భారీ స్కామ్ వెలుగులోకి వచ్చింది. రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించిన పనుల్లో రూ. 46,300 కోట్ల మేర భారీ అక్రమాలు చోటుచేసుకొన్నాయని యాంటీ-కరప్షన్ ఫోరమ్ అధ్యక్షుడు ఎన్నార్ రమేశ్ సంచలన ఆరోపణలు చేశారు. బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బీబీఎంపీ)కి చెందిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కుంభకోణంలో భాగమైనట్టు మండిపడ్డారు. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులకు 4,113 పేజీలతో కూడిన డాక్యుమెంట్లను అందజేశారు. 2013-14 నుంచి 2023-24 మధ్య గడిచిన 9.5 ఏండ్లలో ఈ భారీ కుంభకోణం చోటుచేసుకొన్నట్టు రమేశ్ తన ఫిర్యాదులో ఆరోపించారు.

దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ స్కామ్

ఈడీకి ఫిర్యాదు చేసిన అనంతరం రమేశ్ మీడియాతో మాట్లాడారు. 'గడిచిన 9.5 ఏండ్లలో రోడ్ల మరమ్మతుల కోసం కేటాయించిన రూ. 46,300 కోట్లలో దాదాపు 75 శాతం ప్రజాధనం పక్కదారిపట్టింది. విడుదలైన నిధులకు, చేపట్టిన పనులకు ఎక్కడా పొంతనలేదు. దేశ చరిత్రలోనే ఇది అతిపెద్ద మున్సిపల్ స్కామ్. ఈ కుంభకోణంలో బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉమాశంకర్‌తో పాటు మరో 18 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు భాగమయ్యారు. దీనిపై ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ)కింద కేసు నమోదు చేసి ఈడీ అధికారులు వెంటనే దర్యాప్తు మొదలుపెట్టాలి' అని రమేశ్ డిమాండ్ చేశారు.

40 వేల కోట్ల ఆస్తిని త్యజించి..

బౌద్ధ సన్యాసిగా మారి!

ఆధ్యాత్మిక మార్గంలో మలేషియా బిలియనీర్ కుమారుడు

న్యూఢిల్లీ, నవంబర్ 26: కోట్ల కొద్దీ ఆస్తి. పైగా ఒక్కడే సంతానం. మరొకరెవరైనా అయితే విలాసవంతంగా ఉంటూ జీవితాన్ని ఆనందంగా గడపేస్తారు. కానీ వెన్ అజాన్ సిరిపన్నో తీరే వేరు. మలేషియాకు చెందిన బిలియనీర్ ఆనంద్ కృష్ణన్‌కు ఈయన ఏకైక సంతానం. అయినా కోట్ల ఆస్తిని త్యజించి బౌద్ధ సన్యాసిగా మారిపోయి బుద్ధుని బోధనలు ప్రచారం చేస్తూ సామాన్య జీవితం గడుపుతున్నాడు. ఏకేగా పిలిచే అతని తండ్రి ఆనంద్ కృష్ణన్ రూ.40 వేల కోట్ల ఆస్తితో మలేషియాలోనే మూడో అతి ధనవంతుడుగా పేరొందాడు. విదేశాల్లో చదువుకున్న అజాన్ 18 ఏండ్ల నుంచి ఆధ్యాత్మిక మార్గం వైపు అడుగులు వేశాడు. కుమారుడి మార్గాన్ని తండ్రి కూడా గౌరవించాడు. 18 ఏండ్ల వయసులో అతడి తల్లి కుటుంబానికి నివాళి అర్పించడానికి థాయ్‌లాండ్ వెళ్లాడు. అక్కడ తాత్కాలికంగా ప్రారంభమైన ప్రయాణం ఆయన జీవన గమనాన్ని నిర్దేశించింది. తర్వాత సన్యాసిగా మారి ఆధునిక సిద్ధార్థునిగా రూపాంతరం చెందాడు. మిగిలిన బౌద్ధ భిక్షువుల్లాగ ఆయన కూడా వారితో సామాన్య జీవితం గడుపుతూ బౌద్ధ, థాయ్ అటవీ సంప్రదాయ బోధనలు ప్రచారం చేస్తూ సాదాసీదాగా జీవిస్తున్నారు. బౌద్ధమత సూత్రాలలో కుటుంబ ప్రేమ ఒక్కటి కాబట్టి అప్పుడప్పుడు తన తండ్రిని కలిసి ఆయనతో కొంతకాలం గడుపుతారు.

అవినీతికి పాల్పడితే ఆత్మహత్య!

ఉద్యోగులతో రక్తంతో సంతకం చేయిస్తున్న జపాన్ బ్యాంక్

టోక్యో: 'తప్పు చేసినట్టు రుజువైతే తల నరుక్కుంటా' అన్న మాటను రాజకీయ నేతల నోటంట అప్పుడప్పుడు వింటుంటాం. ఇప్పుడు ఇదే తరహాలో అవినీతికి పాల్పడితే 'ఆత్మహత్య చేసుకుంటాం' అని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్నది జపాన్‌లోని ఒక బ్యాంకు. పైగా ఆ ప్రతిజ్ఞను రక్తంతో సంతకం చేయించి మరీ తీసుకోవడం విశేషం. విధి నిర్వహణలో నగదును అపహరించమని, అవకతవకలు, ఆర్థిక అక్రమాలకు పాల్పడ నని, ఒక వేళ అలా జరిగితే తమ సొంత ఆస్తుల నుంచి వాటిని తిరిగి చెల్లిస్తామని, తర్వాత ఆత్మహత్య చేసుకుంటామని రాసిన ప్రతిజ్ఞపై జపాన్‌లోని షికొకు బ్యాంకు యాజమాన్యం తమ సిబ్బందితో రక్తంతో సంతకం చేయించుకుంటున్నది. ఈ ప్రతిజ్ఞ స్క్రీన్ షాట్‌ను ఒక ఎక్స్ యూజర్ తన ఖాతాలో పెట్టారు.

సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం

బీఆర్ఎస్ నేత వినోద్‌కుమార్

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): సామ్యవాద, లౌకిక విలువలను పునరుద్ఘాటిస్తూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ప్రకటించడం గర్వకారణమని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ హర్షం ప్రకటించారు. రాజ్యాంగ పీఠికలో లౌకిక, సామ్యవాద పదాలను తొలగించాలని బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి సహా కొందరు లాయర్లు వేసిన పిటిషన్లను తిరస్కరిస్తూ ధర్మాసనం ఇచ్చిన తీర్పు స్వాగతించతగినదని తెలిపారు. ఈ తీర్పు రాజ్యాంగంలోని న్యాయం, సమానత్వం వంటి ముఖ్య సిద్ధాంతాలను పునరుద్ఘాటించిందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తీర్పు సాంఘిక, ఆర్థిక సమానత్వాన్ని, మత సామరస్యాన్ని మరింత బలపరుస్తుందనే ఆశాభావం వ్యక్తంచేశారు. సమానత్వం, సాంఘిక న్యాయానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నదని స్పష్టంచేశారు. తాజా పిటిషన్ల వెనుక ఉన్న ఉద్దేశం రాజ్యాంగ పునాది విలువలను దెబ్బతీయడం మాత్రమేనని విమర్శించారు.

మహా హైడ్రామా

- సీఎం పదవికి షిండే రాజీనామా
- కొత్త ముఖ్యమంత్రిపై సందిగ్ధత

గవర్నర్‌కు రాజీనామా సమర్పిస్తున్న ఏక్‌నాథ్ షిండే

ముంబై, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ) : మహారాష్ట్ర కొత్త ప్రభుత్వం ఏర్పడటానికి మార్గం సుగమం చేస్తూ ముఖ్యమంత్రి పదవికి ఏక్‌నాథ్ షిండే మంగళవారం రాజీనామా చేశారు. కొత్త ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టేవరకూ ఆపద్ధర్మంగా కొనసాగాలని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ షిండేను కోరారు. గత శాసనసభ గడువు మంగళవారంతో ముగిసినప్పటికీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై మహారాష్ట్రలో ఇంకా స్పష్టత రాలేదు. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టాలన్నదానిపై సందిగ్ధత నెలకొన్నది. ఓవైపు బీజేపీ అత్యధిక సీట్లు గెలుచుకున్న నేపథ్యంలో తమ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్‌కు ముఖ్యమంత్రి పదవిని అప్పగించాలని ఆ పార్టీ నేతలు కోరుతున్నారు. మరోవైపు.. షిండే నాయకత్వంలోనే ఈ ఎన్నికల్లో తమ కూటమి గెలుపొందినందున ఆయననే ముఖ్యమంత్రిగా కొనసాగించాలని శివసేన కార్యకర్తలు కోరుతున్నారు. ముఖ్యమంత్రి ఎవరవుతారన్న దానిపై బుధవారం ఉదయానికల్లా ఓ స్పష్టత వస్తుందని శివసేన ప్రతినిధి సంజయ్ శిర్సత్ తెలిపారు. ప్రధాని మోదీ సహా బీజేపీ అగ్ర నాయకులు అమిత్‌షా తదితరులతో ఫడ్నవీస్, షిండే, అజిత్‌పవార్ చర్చలు జరుపుతున్నారని వెల్లడించారు. షిండేనే సీఎంగా కొనసాగించాలని ప్రజలు కూడా కోరుకుంటున్నారని, అయితే ఈ విషయంలో బీజేపీ నేతలు ఏమనుకుంటున్నారో తనకు అవగాహన లేదని అన్నారు. ఫడ్నవీస్‌నే మూడోసారి సీఎం గద్దెపై కూర్చోబెట్టాలని బీజేపీ భావిస్తున్నదని మహారాష్ట్రకు చెందిన కేంద్ర మంత్రి రామ్‌దాస్ అఠావలే చెప్పారు. అయితే దీనిని బీజేపీ వర్గాలు ఇంకా ధ్రువీకరించలేదు.

షిండేకు కేంద్రమంత్రి పదవి?

రెండు రోజుల క్రితం దేవేంద్ర ఫడ్నవీస్‌కు జాతీయ స్థాయిలో కీలక పదవి వస్తుందని ప్రచారం జరిగింది. తాజాగా మరో అప్‌డేట్ బయటకు వచ్చింది. ఫడ్నవీస్‌ను ముఖ్యమంత్రిని చేసి ఏక్‌నాథ్ షిండేను కేంద్రమంత్రిగా, ఆయన కుమారుడు శ్రీకాంత్ షిండేను మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా చేస్తారని ప్రచారం జరుగుతున్నది. మరొక ఉప ముఖ్యమంత్రిగా అజిత్ పవార్‌ను ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ ఫార్ములా ద్వారా మూడు పార్టీలనూ ఆకర్షించేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని అంటున్నారు. ఇది షిండే గౌరవాన్ని తక్కువ చేయదని, ఈ విషయం తేలికగా పరిష్కారమవుతుందని బీజేపీ భావిస్తున్నది. అయితే షిండే ముఖ్యమంత్రి కావాలని శివసేన నేతలు గట్టిగా ఒత్తిడి తెస్తున్నారని కూడా చెబుతున్నారు.

బంగ్లాదేశ్‌లో హిందూ నేత కృష్ణదాస్ అరెస్ట్

- దేశద్రోహం ఆరోపణలు.. బెయిల్ నిరాకరించిన కోర్టు
- న్యాయస్థానం వద్ద వేలాది హిందువుల ఆందోళన
- పోలీస్ కాల్పుల్లో చిన్మయ్ కృష్ణ దాస్ న్యాయవాది మృతి
- అరెస్ట్‌ను ఖండించిన భారత్

ఢాకా: దేశద్రోహం ఆరోపణలపై ప్రముఖ హిందూ నాయకుడు చిన్మయ్ కృష్ణ దాస్ బ్రహ్మచారిని బంగ్లాదేశ్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఆయన అరెస్ట్‌ను నిరసిస్తూ వేలాది మంది హిందువులు ఆందోళనకు దిగారు. నిరసన తెలుపుతున్న హిందువులపై పోలీసులు కాల్పులు జరపడం ఉద్రిక్తతకు దారి తీసింది. హిందూ సంస్థ సమ్మిళిత సనాతన నేత అయిన బ్రహ్మచారిని హజ్రత్ విమానాశ్రయ సమీపంలో అరెస్ట్ చేసి, అనంతరం చిట్టగ్యాంగ్‌కు తీసుకువచ్చారు. అక్టోబర్ 25న బ్రహ్మచారి ఒక ర్యాలీ సందర్భంగా జాతీయ జెండాను అవమానపర్చారంటూ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ నేత ఖలీదా జియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై దేశద్రోహం కేసు నమోదైంది. ఈ కేసులో చిన్మయ్ కృష్ణ దాస్‌కు బెయిల్ ఇవ్వడానికి మంగళవారం మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించింది.

హిందువుల ర్యాలీ

చిన్మయ్ కృష్ణ దాస్ అరెస్ట్‌ను నిరసిస్తూ వేలాది మంది కోర్టు ప్రాంగణానికి చేరుకుని, ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయనను జైలుకు తీసుకెళుతున్న వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వారిపై కాల్పులు జరపడంతో ఆయన న్యాయవాది సైఫుల్ ఇస్లామ్ మృతి చెందారు. చిట్టగాంగ్, ఢాకాలలోనూ వందలాది మంది హిందువులు ర్యాలీ నిర్వహించారు. బ్రహ్మచారి అరెస్ట్‌ను భారత విదేశాంగ శాఖ, బంగ్లాదేశ్ హిందూ బౌద్ధ క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ ఖండించింది.

సామాన్యుల జీవితాలు మెరుగవ్వాలి

- రాజ్యాంగ స్ఫూర్తి చెప్పున్నది ఇదే
- కార్యనిర్వాహక, న్యాయ, శాసన వ్యవస్థలు కలిసి పని చేయాలి
- రాజ్యాంగ దినోత్సవంలో రాష్ట్రపతి

న్యూఢిల్లీ, నవంబర్ 26: రాజ్యాంగస్ఫూర్తికి అనుగుణంగా సామాన్య ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు కార్యనిర్వాహక, న్యాయ, శాసన వ్యవస్థలు కలిసికట్టుగా పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏండ్లు అవుతున్న సందర్భంగా మంగళవారం పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో జరిగిన రాజ్యాంగ దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

రాష్ట్రపతిని అవమానించిన రాహుల్!

రాజ్యాంగ దినోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అవమానించారని బీజేపీ ఆరోపించింది. ఇందుకు సంబంధించి రెండు వీడియోలను 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. వేదికపై రాష్ట్రపతి కూర్చోకముందే రాహుల్ గాంధీ కూర్చున్నట్టుగా, మల్లికార్జున ఖర్గే.. ఆయనను నిలబడాల్సిందిగా సూచిస్తున్నట్టుగా ఒక వీడియో ఉంది. మరో వీడియోలో ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్, ప్రధాని మోదీ, ఖర్గే రాష్ట్రపతికి నిలబడి నమస్కరిస్తుండగా, రాహుల్ గాంధీ నమస్కరించనట్టుగా కనిపిస్తున్నది.

ఓడితే ఈవీఎంలు ట్యాంపరింగ్ అయినట్టా?

- 'పేపర్ బ్యాలెట్' కోసం దాఖలైన పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: ఈవీఎంలను ట్యాంపర్ చేయవచ్చనే ఆరోపణలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఓడిపోయినప్పుడే ఈవీఎంల ట్యాంపర్ గురించి మాట్లాడతారని వ్యాఖ్యానించింది. ఈవీఎంల స్థానంలో పేపర్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ జరపాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని మంగళవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీబీ వరాలే ధర్మాసనం విచారించింది. పాల్ స్వయంగా హాజరై వాదనలు వినిపించారు. ఓడినప్పుడే ఈవీఎంలు ట్యాం పరింగ్ అయ్యాయని ఆరోపిస్తున్నారని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఈ ఆలోచనలు ఎలా వస్తాయి?

ఎన్నికల్లో ఓటర్లకు డబ్బులు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేసిన అభ్యర్థులను కనీసం ఐదేండ్లు అనర్హులుగా ప్రకటించాలని కేఏ పాల్ తన పిటిషన్‌లో కోరారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. 'మీ దగ్గర చాలా ఆసక్తికర వ్యాజ్యాలు ఉన్నాయి. ఇలాంటి అద్భుతమైన ఆలోచనలు మీకు ఎలా వస్తాయి?' అంటూ అసహనం వ్యక్తం చేసింది. కేఏ పాల్ వ్యాజ్యాన్ని కొట్టేసింది.

డిసెంబర్ 20న రాజ్యసభ ఉప ఎన్నికలు

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో ఖాళీ అయిన ఆరు రాజ్యసభ స్థానాలకు డిసెంబర్ 20న ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని మూడు స్థానాలు, ఒడిశా, పశ్చిమబెంగాల్, హర్యానాలో ఒక్కో స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు డిసెంబర్ 3న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న స్క్రూటినీ, 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. డిసెంబర్ 20న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరుగుతుంది. అదేరోజు సాయంత్రం 5 గంటలకు కౌంటింగ్ ప్రారంభించి తుది ఫలితాలను ప్రకటిస్తారు.

పాన్‌కార్డు ఉన్నవాళ్లు పాన్ 2.0 కింద మళ్లీ దరఖాస్తు చేయక్కర్లేదు

ఆదాయ పన్ను శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 26: శాశ్వత ఖాతా సంఖ్య (పాన్) కలిగిన వాళ్లంతా కేంద్రం కొత్తగా తీసుకువస్తున్న పాన్ 2.0కు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని ఆదాయ పన్ను (ఐటీ) శాఖ మంగళవారం స్పష్టత ఇచ్చింది. 'ఇప్పటివరకు జారీ చేసిన పాన్ కార్డ్‌లు 'పాన్ 2.0' వ్యవస్థలోనూ చెల్లుబాటు అవుతాయి. ఇక క్యూఆర్ కోడ్ అన్నది కొత్తదేమీ కాదు. 2017-18 నుంచి ఇస్తున్న పాన్ కార్డులపై అది ఉంటున్నది. క్యూఆర్ కోడ్ లేనివాళ్లు పాన్ 2.0 ద్వారా కొత్తవి పొందొచ్చు' అని ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డ్ వివరించింది. రూ.1,435 కోట్లతో కేంద్రం 'పాన్ 2.0' ప్రాజెక్ట్ చేపడుతున్న సంగతి తెలిసిందే.

ఒక్కో అమెరికా పౌరుడిపై 91 లక్షల అప్పు

- అప్పుల కుప్పగా మారుతున్న అగ్రరాజ్యం
- రూ.3,035 లక్షల కోట్లకు చేరిన ప్రభుత్వ రుణం
- డొనాల్డ్ ట్రంప్ ముందు అతిపెద్ద సవాల్

వాషింగ్టన్: పేద దేశాలే కాదు అగ్రరాజ్యమూ అప్పులకుప్పగా మారుతున్నది. కొత్త దేశాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న డొనాల్డ్ ట్రంప్‌నకు ఈ అప్పుల భారం అతిపెద్ద సవాల్‌గా మారనున్నది. తాజా లెక్కల ప్రకారం అమెరికా అప్పు ఏకంగా 36 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. భారత కరెన్సీలో ఇది అక్షరాలా 3,035 లక్షల కోట్ల రూ